నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. కర్మన్‌ఘాట్, సాయిరాంనగర్ 33/11 విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం గం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు గ్రీన్‌పార్క్, కర్మన్‌ఘాట్, శ్రీరామ్, నిర్మలానగర్, హనుమాన్‌నగర్, సాయిరాంనగర్ అదే విధంగా వినయ్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు వినయ్‌నగర్, కృష్ణానగర్, ఎస్ఎస్సార్, బీఎస్ఎన్ఎల్, శ్రీనివాసనగర్, బాలాజీనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో పరిధిలో..

సైదాబాద్: ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. సీ క్వార్టర్స్, ముంతాజ కాలేజ్ క్రాస్ రోడ్, హనుమాన్ టెంపుల్, నూర్ కేఫ్ హోటల్, సుల్తాన్‌పురా, గ్రాండ్ హోటల్, కాలికబర్, మెస్కో హాస్పిటల్, పరీవ్స్ కేఫ్, అబిద అలీ ఐ, ఇమ్లిబన్ బస్టాప్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు

ఆస్మాన్‌గఢ్, వెంకటాద్రి నగర్, గడ్డిఅన్నారం, ఆర్‌బీ కాలనీ, డబీర్‌పురా మెయిన్‌రోడ్, యాసీన్ జంగ్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2:30 నుంచి 3 వరకు...

ఆనంద్‌నగర్, మలక్‌పేట ప్రొఫెసర్ కాలనీ, హనుమాన్ టెంపుల్, డీ మార్ట్, చర్మాస్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టు

మలక్‌పేట: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం నిర్మాణంపై కమిషన్ ముందు హాజరు కానున్న సందర్భంగా మలక్‌పేట పోలీసులు బీఆర్ఎస్ మలక్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి తీగల అజిత్‌రెడ్డి, మూసారంబాగ్ డివిజన్ అధ్యక్షుడు చల్లారి రఘునందన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గౌర శశిధర్ రావు, పలువురు నాయకులను ముందుస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసీఆర్ విచారణ ముగిసిన తర్వాత సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

ఎల్‌బీనగర్: డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నాని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధిలోని సీఎస్ఆర్ కాలనీ నుంచి బీఎంఎస్‌యాదవ్ కాలనీ వరకు రూ.26.20 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గతేడాది టెండర్ అయ్యి పెండింగ్ ఉన్న పనులను ఒక్కొక్కటిగా ప్రారంభిస్తున్నామన్నారు. కాంట్రాక్టర్లు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాయిల్‌గౌడ్, హరినాథ్, రాజేందర్‌రెడ్డి, కృష్ణగౌడ్ హరిప్రసాద్, నరేష్, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని కొంతమంది కార్పొరేటర్లు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, అభివృద్ధి పనులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు చేసిన శంకుస్థాపనలకే మళ్లీ శంకుస్థాపనలు చేస్తున్నారని బీఆర్ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ ఆరోపించారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజుల క్రితం అన్ని పార్టీలకు చెందిన కార్పొరేటర్లు ఏకమై పలు అభివృద్ధి పనులకు మంత్రిచే శంకుస్థాపనలు చేయించారని పనులు ప్రారంభం అవుతుండడంతో తిరిగి అవే పనులకు కార్పొరేటర్లు మళ్లీ శంకుస్థాపనలు చేస్తున్నారని విమర్శించారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

వనస్థలిపురం: కాలనీలలో అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతున్నట్లు వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని అభ్యుదయనగర్‌లో రూ. 92 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గంగిరెడ్డి, కార్యదర్శి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సలావుద్దీన్, కృష్ణప్రసాద్, సీతారామరాజు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్ రాజు, హరిందర్ రెడ్డి, సాయికిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

అభినందనలు



మంత్రి వివవేక్‌తో షకీల్

చాదర్‌ఘాట్: రాష్ట్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వివేక్‌ను హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ షకీల్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారత రాజ్యాంగం పుస్తకాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా షకీల్ మాట్లాడుతూ.. పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

అవగాహన కల్పిస్తూ.. బడుల్లో చేర్పిస్తూ

- జోరుగా బడిబాట
- ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం
- సత్ఫలితాలిస్తుందంటున్న అధికారులు



బడిబాట కార్యక్రమంలో మలక్‌పేట హైస్కూల్ ఉపాధ్యాయులు

మలక్‌పేట: బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలనే ఉద్దేశంతో కొనసాగుతున్న బాడిబాట కార్యక్రమంలో ఈ నెల19 తేదీ వరకు కొనసాగుతోంది. ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల విద్యాబోధన కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.పాఠశాలలో పట్టణ సభ నిర్వహించి ప్రభుత్వ పాఠశాల సాధిస్తున్న ఫలితాలు, విద్యాబోధన తీరు తదితర వాటిని క్లుప్తంగా వివరిస్తున్నారు. సైదాబాద్ జోన్ పరిధిలోని ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జోన్ డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ పేర్కొంటున్నారు.

ఇంటింటికి వెళ్లి అవగాహన..

జోన్ పరిధిలోని మూసారంబాగ్, అక్బర్‌బాగ్, సైదాబాద్, ఐఎస్‌సదన్, మాదన్నపేట, ఓల్డ్‌మలక్‌పేట, ఆజంపుర, ఛావుణి, కాచిగూడ ప్రాంతాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జోరుగా బాడిబాట కొనసాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. ఇతరులను దృష్టిలో గొప్పగా ఉంటుందని, ప్రైవేట్ స్కూల్లో చేరిస్తే మీ పిల్లలకు మానసిక ఒత్తిడి, మీకు ఆర్థిక ఒత్తిడి. చుట్టాలు, చుట్టుపక్కల వాళ్ల చేర్పించారని ప్రైవేట్ స్కూళ్ల బాట పట్టొదంటూ విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్నారు.

వసతులు వివరిస్తూ..

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు విద్యాబోధన అందిస్తున్నారని, ప్రభుత్వ ఏఐ లాంటి సాంకేతిక సదుపాయాలతో పాటు మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు , నోటుబుక్స్ లాంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్తున్నారు. విద్యార్థుల మానసికోల్లాసం, వికాసం కోసం ప్రతి దినం క్రీడల్లో శిక్షణ, విశాలమైన తరగతి గదులు, 10వ, తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, 6,7,8,9,వారికి ప్రత్యేకంగా ఐఐటీ ఫౌండేషన్ కోర్సులో శిక్షణ, ప్రభుత్వ పాఠశాలలు సాధిస్తున్న ఫలితాలు, కల్పిస్తున్న వసతులు వివరిస్తున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల వివరాలు నమోదు చేసుకుంటున్నారు.



పట్టణ సభలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బడిబాటతో సత్ఫలితాలు..



బడిబాటతో సత్ఫలితాలోస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు, చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు. ఉపాధ్యాయులు సమష్టి కృషితో విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం పెరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలలో చేరితే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– తిరునగరి రాధాకృష్ణ, డిప్యూటీ ఈవో, సైదాబాద్ జోన్

ప్రైవేటుకు దీటుగా విద్యా బోధన

నాగోలు: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని మండల ప్రజా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బడిబాటలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఉంటుందని ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, బస్తీవాసులు మేకల సత్యనారాయణ, ఉపేందర్ సింగ్, నాయకులు మంచి రాజేష్, సుందర్ నారాయణ, మహేందర్ యాదవ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ పవన్‌కుమార్, ఎంఈఓ రామారావు

ఘనంగా అష్టాదశ వార్షికోత్సవం



శ్రీ చక్ర అర్చన చేస్తున్న పండితులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అలకాపురిలో శృంగేరి శంకర మఠంలోని శారదా చంద్రమౌళీశ్వర అష్టాదశ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో శ్రీ శారదాంబ మహాకాళీ అలంకరణ దర్శనం, గురుపాదుకా పూజ, వేదాపారాయణం, గోపూజ, శ్రీ చక్ర నవావరణార్చన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశనం, దీక్షాధారణ, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మాధికారి కే.వీ శ్రీనివాస్, కమిటీ సభ్యులు దేవ భాస్కర్‌రెడ్డి, శోభనాద్రి, సుర్యానారాయణ శర్మ, గౌరి శంకర్, నర్సింహమూర్తి, శ్రీనివాస్ బంగారయ్య శర్మ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



పనులు ప్రారంభించిన కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. క్రాంతినగర్ కమాన్ నుంచి జీవన్‌జ్యోతి సంఘం వరకు ఉన్న మార్గంలో రూ. 19 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె జీహెచ్ఎంసీ అధికారులు, బస్తీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సైదాబాద్‌లోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, బస్తీవాసులు పాల్గొన్నారు.

పాఠశాల మరమ్మతు పనులు ప్రారంభం



పాఠశాలను పరిశీలిస్తున్న మధుయాష్కిగౌడ్

నాగోలు: బండ్లగూడలోని ప్రభుత్వ పాఠశాల నిర్మాణం పనులు చేపట్టేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, త్వరలోనే జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్‌తో మాట్లాడి పాఠశాల భవన నిర్మాణం చేయిస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. బుధవారం నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. పాత గోడలు, వర్షానికి కురిసే రేకుల షెడ్డు, నేలపై ఎలుకలు చేసిన రంధ్రాలు చూసి చలిలించిన ఆయన వెంటనే తన జేబులో నుంచి డబ్బులు తీశాడు. మీరు కూడా సహాయం చేయండి అంటూ తన వెంట వచ్చిన నాయకులు, కార్యకర్తలు కోరగా తలా రూ.1000 సహాయం చేయగా వాటితో రేకుల షెడ్డుకు మరమ్మతు పనులు ప్రారంభించారు. పాఠశాలకు కుర్చీలు, టేబుళ్లు తాను పంపిస్తానని హామీ ఇచ్చారు.

- బండ్లగూడ పాత గ్రామంలో అడ్డగోలుగా తోవ్వేసిన రోడ్లను ఆయన పరిశీలించి వెంటనే రోడ్డు నిర్మించేలా చర్యలు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ప్రకాష్‌గౌడ్ , భవానిశంకర్ గౌడ్, అశోక్‌గౌడ్, సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, చెరుకు జంగయ్యగౌడ్, సహదేవ్ గౌడ్, పంగా గౌతమ్, తూర్పాటి జగదీష్, నూనె మూతల లక్ష్మయ్య ఉన్నారు.

నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చైతన్యపురి: అన్నవర క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి దేవాలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఆరురోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి చైర్మన్ దేవరం లింగారెడ్డి తెలిపారు. మొదటి రోజు ఉదయం 8 గంటలకు భక్తులు బహూకరించిన 108 వెండి కలశాలను పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి స్వామివారికి పంచామృతాలు, పూలతో అభిషేకం చేస్తారన్నారు. ఆదివారం శ్రీరమాసహిత శ్రీవీరవెంకటే సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. అలాగే నిత్యం ఉదయం 7, 8, 10 గంటలు, సాయంత్రం 7 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తారన్నారు. బుధవారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సింహాగుప్తా, చకిలం రమణయ్య, చిదర నాగేందర్, వక్కలంక శ్రీనివాస్‌రావు, బచ్చు సత్యనారాయణ, కుమారస్వామి, పాల్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల సీజ్



పాఠశాలను సీజ్ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

హయత్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఓ ప్రైవేటు పాఠశాలను సీజ్ చేసినట్లు హయత్‌నగర్ మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. హయత్‌నగరలోని కుంట్లూర్ రోడ్డులో ఉన్న రవింద్రభారతి పాఠశాలను శ్మశాన వాటిక పక్కన ఏర్పాటు చేయడమే కాకుండా గుర్తింపును మార్పు చేసుకోలేదు. ఈ విషయంపై భారీగా ఫిర్యాదులు వచ్చాయి. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, డీఈఓల నుంచి ఆదేశాలు అందడంతో పాఠశాలను సీజ్ చేసినట్లు ఎంఈఓ తెలిపారు. గుర్తింపు లేకుండా పాఠశాలలను నిర్వహిస్తే చర్యలు తప్పవని, హెచ్చరించారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

సైదాబాద్: బైక్‌పై నుంచి కిందపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పూసలబస్తీకి చెందిన ఇంద్రాన్ (22) బుధవారం తెల్లవారుజామున బస్తీలో తన బైక్‌పై వెళ్తుండగా మూడుగుళ్ల చౌరస్తా సమీపంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి, ఆ తర్వాత మలక్‌పేట యశోద ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్ ప్రారంభిస్తున్న భాగ్యలక్ష్మి, డీసీ జయంత్

మలక్‌పేట: వర్షాకాలంలో నేపథ్యంలో ముందస్తుగా జీహెచ్ఎంసీ పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. బుధవారం మూసారంబాగ్‌లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్, ఏఎంహెచ్‌వో రుద్ర శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ సందర్భంగా అందిన ఫిర్యాదులు క్లియర్ చేయాలన్నారు. బస్తీలు, కాలనీలలో చెత్త, వ్యర్థాలు లేకుండా తొలగించాలన్నారు. బోనాల పండుగ నేపథ్యంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. శానిటేషన్ నిర్వహణలో అవకతవకలు ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కొంగర ప్రవీణ్, కృష్ణారెడ్డి, జవాన్ రాజు, రాంకీ ఇన్‌చార్జి కళ్యాణ్, ఎస్ఎఫ్ఏలు, కార్మికులు పాల్గొన్నారు.

బీఆర్‌కే భవన్‌కు బీఆర్ఎస్ నేతలు

ఎల్‌బీనగర్: జస్టీస్ గోష్ కమిషన్ విచారణకు హాజరవుతున్న మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు మద్దతుగా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు బుధవారం భారీ ఎత్తున తరలివెళ్లారు. ఎల్‌బీనగర్‌లోని పలు డివిజన్ల నుంచి నేతలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని అక్కడి నుంచి బీఆర్‌కే భవన్‌కు ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే బీఆర్‌కే భవన్ వద్ద నిరసన తెలిపారు. మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలి వెళ్లారు.

ఘనంగా చండీయాగం

ఎల్‌బీనగర్: ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన సందర్భంగా తత్వం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ, సిద్ధార్థశర్మ నేతృత్వంలో ఎల్‌బీనగర్‌లోని సువర్ణభారతి గోశాలలో బుధవారం చండీయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళామోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి, సీనియర్ నేతలు మీనాక్షి గిరిధారి, కల్యాణి హాజరై మాట్లాడారు. కొవిడ్ లాంటి విషమ పరిస్థితుల్లో వందకోట్లకు పైగా దేశ ప్రజలకు ఉచితంగా టీకాలను అందించారన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని రాజిరెడ్డినగర్ కాలనీలో రూ. 40 లక్షలతో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న పనుల్లో స్థానికులు భాగస్వాములవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏఈ గోపాలకృష్ణ, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు క్రాంతికుమార్, బాల్‌రెడ్డి నాయకులు రమేష్‌గౌడ్, సుమిత్ పాల్గొన్నారు.

ఉచిత వివాహ సమాచార కేంద్రం ప్రారంభం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

చైతన్యపురి: శ్రీవిరాట్ విశ్వకర్మ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వివాహ సమాచార కేంద్రం ప్రారంభించినట్లు సేవాసమిత అధ్యక్షుడు కీర్తిగారి అనంతాచారి తెలిపారు. విశ్వబ్రాహ్మణ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలలో వివాహ సమస్య ప్రధానంగా ఉందని దీన్ని పరిష్కరించేందుకు ఉచితంగా వివాహ సమాచార కేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వివాహ సమాచార కేంద్రం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గోవర్ధనాచారి, ప్రవీణ్‌చారి, నరేందర్‌చారి, కిట్టు, శ్రీనివాస్, రవి, భాస్కర్, రామకృష్ణ పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం



యుగంధర్

చాదర్‌ఘాట్: నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయ ఆవరణలోని ప్రభుత్వ బధిరుల బాలుర ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ వి.యుగంధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకటి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు ఉంటాయన్నారు. విద్యార్థులు సదరం సర్టిఫికెట్, ఆధార కార్డు, జనన ధృవీకరణ పత్రం, టీసీ, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకొని రావాలని సూచించారు. ఉచిత భోజనం, హాస్టల్ వసతి, యూనిఫామ్, కాస్మెటిక్ చార్జులు ఇస్తామని పూర్తి వివరాలకు 9000957214 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రూ. 50 లక్షలతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు



పార్కులో పర్యటిస్తున్న అధికారులు, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద, యూబీడీ డీడీ రుద్రనాథ్, ఏఈ కిరణ్, జీహెచ్ఎంసీ ఏఈ శరత్‌రెడ్డి బుధవారం డివిజన్‌లోని శాలివాహనగర్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా వారు పార్కులో నెలకొన్న సమస్యలను పరిశీలించి అభివృద్ధి పనులపై చర్చించారు. పార్కులో టైల్స్, ఓపెన్ జిమ్, గ్రీనరీ, వాకింగ్ పాత్, మొక్కల పెంపకం, తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్, పార్కు నిర్వహణ కమిటీ సభ్యులు అధికారులను కోరారు. చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడి ఇరుశాఖల సమన్వయంతో పార్కును సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సుమారు రూ.50 లక్షల నిధులతో పార్కును అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కృష్ణకుమార్, పార్కు కమిటీ అధ్యక్షుడు చెల్లారి రఘునందన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, నూలి శ్రీధర్, నందు, తదితరులు ఉన్నారు.

బీసీల చైతన్యమే లక్ష్యం




రాష్ట్ర కమిటీని ప్రకటిస్తున్న కటకం నర్సింగ్‌రావు

నాగోలు: బీసీల చైతన్యమే లక్ష్యంగా మన ఆలోచన సాధన సమితిని ఏర్పాటు చేసినట్ల అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు తెలిపారు. నాగోలులోని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర కార్యాయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా రాష్ట్ర కమిటీని ఆయన ప్రకటించి మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న బీసీ కులవృత్తులను చేసుకునే వారిని రాజకీయ, ఆర్థిక, సామాజికంగా చైతన్యపరచడానికి తెలంగాణలో ఉన్న మేధావులు, విద్యావేత్తలు, ఉద్యోగస్తులు బీసీ ఉద్యమకారులు వివిధ కుల సంఘం నాయకులు తెలంగాణ ఉద్యమకారులతోపాటు పలువురితో అనేక సార్లు చర్చలు సమావేశాలు నిర్వహించామన్నారు. పది మాసాల క్రితం మన ఆలోచన సాధన సమితిని ఏర్పాటు చేసుకొని ఏప్రిల్ 15న హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో మన ఆలోచన సాధన సమితి (మాస్) ను ఆవిర్భావ చేసుకొని సభ నిర్వహించడం జరిగిందన్నారు.

అనాథ విద్యార్థి గృహంలో పుట్టినరోజు వేడుకలు

దిల్‌సుఖ్‌నగర్: రంగారెడ్డి జిల్లా కోర్టు జడ్జి సుదర్శన్ తన పుట్టినరోజు వేడుకలను ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహంలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గృహం అనాథ విద్యార్థులకు ఒక అద్భుత గృహమని విద్యార్థులకు అందమైన బిల్డింగు, అద్భుతమైన సౌకర్యాలు ముఖ్యంగా మంచి లైబ్రరీ ఆధునిక కంప్యూటర్ ల్యాబ్, ఆడిటోరియం, స్టడీ హాల్ అన్ని సమకూర్చి వారిని ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివిస్తూ బంగారు భవిష్యతకు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం 120 మంది విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు.

వ్యక్తి అదృశ్యం



సతీష్‌కుమార్

చైతన్యపురి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మారుతీనగర్ సాయి నివాస్ అపార్టుమెంటులో ఉండే వ్యాపారి కలవల వెంకట సతీష్‌కుమార్ (50) సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో బుధవారం భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9912220363
9912220365